


## • తలాపునే ప్రాణహిత.. తప్పని నీటిగోస



కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్‌పేట్ మండలంలోని మొర్లిగూడ సమీపంలో ప్రాణహిత నది పారుతున్నా గుక్కెడు నీటికి గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో రెండు వాడలకు కొన్ని రోజులుగా మిషన్‌భగీరథ నీరు అందడం లేదు. మరికొందరు ప్రాణహిత నది నుంచి డ్రమ్ములు నింపి ఎడ్ల బండ్లపై తెచ్చుకుంటున్నారు. – పెంచికల్‌పేట్

## • పశువులకు మేతగా ఎండిన మక్కజొన్న



హన్మకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం చంటయ్యపల్లికి చెందిన కౌలు రైతు కర్ణకంటి వీరబ్రహ్మాచారి రెండెకరాల్లో మక్కజొన్న పంట వేశాడు. ఏటా వ్యవసాయ బావిలో యాసంగికి నీరుండేది. ఈ ఏడాది ఏమైందో ఏమోగాని వ్యవసాయ బావిలో చుక్క నీరు లేకుండా పోయింది. ఇప్పటికే ఎకరం భూమిలో మక్కజొన్న పూర్తిగా ఎండిపోయింది. చేసేదేమీ లేక ఆ పంటను పశువులకు వదిలేశాడు. సాగుకోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక ఆందోళన చెందుతున్నాడు. – భీమదేవరపల్లి

## • ఎకరం ఎండింది..



నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలం న్యాలోలం గ్రామానికి చెందిన రైతు సాయినాథ్ తనకున్న ఎకరం భూమిలో వరి వేశాడు. రూ.25 వేల వరకు ఖర్చు చేశాడు. బోరు బావి ద్వారా నీరందిస్తున్నాడు. భూగర్భ జలాలు అడుగంటడంతో నీరందక పంట ఎండిపోయింది. – దిలావర్‌పూర్

# మూడో పంటకూ మోక్షం లేదు

సీతారామ ప్రాజెక్టుపై సర్కారు నిర్లక్ష్యం

- బీఆర్‌ఎస్ హయాంలోనే 70% పనులు పూర్తి
- పెండింగ్‌లో 5 కిలోమీటర్ల పైపులైన్ నిర్మాణం
- అది పూర్తయితే 5 వేల ఎకరాలు సాగులోకి..
- విద్యుత్తు ఇస్తే తక్షణమే 2,000 ఎకరాలకు సాగునీరు
- ప్రాజెక్టులపై కొనసాగుతున్న కాంగ్రెస్ ప్రభుత్వ వివక్ష

జయశంకర్ భూపాలపల్లి. ఏప్రిల్ 2(నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన ప్రాజెక్టులపై రేవంత్ రెడ్డి ప్రభుత్వ వివక్ష కొనసాగుతున్నది. తెలంగాణలో కేసీఆర్ మూలాలను చెరిపేసే కుట్రలు జరుగుతున్నాయనడానికి ప్రాజెక్టులే నిదర్శనం. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టును 15 నెలలుగా పక్కనబెట్టారు. ఎన్‌డీఎస్‌ఏ, విచారణ కమిటీల పేరుతో ఈ ప్రభుత్వం ఇంకా కాలయాపన చేస్తూనే ఉన్నది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం 70% పనులు పూర్తిచేసిన చిన్న కాళేశ్వరం ప్రాజెక్టునూ ఇప్పటికీ పూర్తిచేయనేలేదు. డీబీఎం 38 కాల్వ ద్వారా చుక్క నీరివ్వలేదు. చివరికి బీఆర్‌ఎస్ హయాంలో 70% పనులు పూర్తయిన సీతారామ ప్రాజెక్టునూ పక్కన పెట్టేశారు. 15 నెలల కాలంలో పైసా పని చేయలేదు. కనీసం విద్యుత్తు సౌకర్యం కల్పిస్తే నిర్మించిన పైపులైన్ల వరకైనా సాగునీరు అందేది. సుమారు 2,000 ఎకరాలు సాగులోకి వచ్చేవి. ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతులు 15 నెలల కాలంలో మూడో పంటనూ నష్టపోయారు. ఈ ప్రాజెక్టు పైపులైన్ పనులు పూర్తిచేస్తే 5 వేల ఎకరాలు సాగులోకి వచ్చేది. కనీసం సీతారామ ప్రాజెక్టు ఊసే ఎత్తడం లేదంటే, రేవంత్ ప్రభుత్వానికి ప్రాజెక్టులపై ఉన్న చిత్తశుద్ధి అవగతం అవుతున్నది.



భూపాలపల్లి మండలం గొల్లబుద్దారంలో గల భీంగణపూర్ రిజర్వాయర్

### సీతారామ ప్రాజెక్టే పెద్ద దిక్కు

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని భూపాలపల్లి మండలం గొల్లబుద్దారం సమీపంలో భీంగణపూర్ రిజర్వాయర్ వద్ద బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2020లో సీతారామ ప్రాజెక్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. మెట్ట భూములను సాగులోకి తేవాలనే లక్ష్యంతో రూ.64 కోట్లతో కేసీఆర్ సర్కారు ఈ ప్రాజెక్టును మొదలుపెట్టింది. పంప్‌హౌస్, సబ్‌స్టేషన్, 14 కిలోమీటర్ల పొడవునా పైపులైన్ నిర్మాణం చేపట్టి గండికామారం, గొల్లబుద్దారం, దూదేకులపల్లి, దీక్షకుంట గ్రామాల రైతులకు సాగునీరు అందించాల్సి ఉన్నది. పంప్‌హౌస్, సబ్‌స్టేషన్ నిర్మాణంతోపాటు 9 కిలోమీటర్ల పొడవునా పైపులైన్ నిర్మాణ పనులను ఆనాడే పూర్తిచేశారు. పంప్‌హౌస్ సమీపంలో నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసి నీటిని ఎత్తిపోసేందుకు నాలుగు 240 హెచ్‌పీ మోటార్లు, మూడు 170 హెచ్‌పీ మోటర్లను ఏర్పాటుచేశారు. మరో 5 కిలోమీటర్ల పొడవునా పైపులైన్ నిర్మాణం జరపాల్సి ఉన్నది. అక్కడ అటవీ భూములు ఉండటంతో అటవీశాఖ అభ్యంతరం తెలిపింది. ఈ క్రమంలో పనుల్లో జాప్యం ఏర్పడింది. చివరికి అప్పటి కలెక్టర్ భవేశ్‌మిశ్రా అటవీశాఖ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. అప్పటికే ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో సీతారామ ప్రాజెక్టును పట్టించుకునే దిక్కు లేకుండాపోయింది.

### రూ.6 కోట్లతో పనులు పూర్తి

సీతారామ ప్రాజెక్టులో 5 కిలోమీటర్ల పెండింగ్ పనులు పూర్తిచేసి, విద్యుత్తు సౌకర్యం కల్పిస్తే 5 వేల ఎకరాల భూములు సాగులోకి వస్తాయి. భీంగణపూర్ రిజర్వాయర్ వద్ద ప్రాజెక్టు నిర్మిస్తే మెట్ట భూములకు సాగునీరు అందుతుందని భావించిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇక్కడ సీతారామ ప్రాజెక్టు నిర్మించింది. రూ.6 కోట్లు వెచ్చించి పైపులైన్, విద్యుత్తు సౌకర్యం కల్పిస్తే రైతులకు ఇప్పటికీ మూడు పంటలు పండేవి. కనీసం విద్యుత్తు సౌకర్యం కల్పించినా 9 కిలోమీటర్ల మేర ఉన్న పైపులైన్ ద్వారా సుమారు 2 వేల ఎకరాలు సత్వరమే సాగులోకి వచ్చేవి. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విషయమై నోరు మెదపకపోవడం రైతులకు శాపంగా మారింది.

### కరెంటు ఇచ్చినా నీళ్లత్తయి

టీఆర్‌ఎస్ గవర్నమెంట్ మంచి ఆలోచన చేసి ఈ ప్రాజెక్టు కట్టింది. 9 కిలోమీటర్లు పైపులైన్లు నిర్మించారు. అప్పుడు ఫారెస్టు అధికారుల మూలంగా పనులు ఆగినయ్. లేకుంటే ఎప్పుడో పనులు పూర్తయ్యేది. భూములన్నీ సాగులోకి వచ్చేవి. ఈ ప్రభుత్వం వచ్చిన వెంటనే కనీసం కరెంటు కనెక్షన్ ఇప్పించినా నీళ్లొచ్చేవి. మూడు పంటలు నష్టపోయేవాళ్లు కాదు. నీళ్ల లేక అరిగోస పడుతున్నం. కనీసం కరెంట్ కనెక్షన్ ఇప్పించి రైతులను ఆదుకోవాలి.


– భూక్యా గోపీనాయక్, గొల్లబుద్దారం

### పంట దక్కలేదని కౌలు రైతు ఆత్మహత్య

- అప్పు చేసి పంటకు పెట్టుబడి
- నష్టం రావడంతో మనస్తాపం
- కరీంనగర్ జిల్లా సిరిసేడులో విషాదం



మధు (ఫైల్)




ఇల్లందకుంట, ఏప్రిల్ 2: అప్పు చేసి పెట్టుబడి పెట్టినా దిగుబడి రాక మనస్తాపంతో కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండలం సిరిసేడులో చోటుచేసుకున్నది. గ్రామస్థుల కథనం ప్రకారం.. సిరిసేడు గ్రామానికి వంగ మధు (28) ఈ సీజన్‌లో మూడెకరాలు కౌలుకు తీసుకున్నాడు. పంట పెట్టుబడికి అప్పు చేసి సీడ్ మక్క సాగు చేశాడు. దిగుబడి రాకపోవడంతో మనస్తాపం చెందాడు. గ్రామ శివారులోని గుట్టల వద్ద గత నెల 30న పురుగు మందు తాగాడు. విషయం తెలుసుకున్న బంధువులు మధును వెంటనే వరంగల్ ఎంజీఎంకు తరలించగా, చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు.

### పూడిక తీస్తుండగా బావిలో పడి రైతు మృతి

గంభీరావుపేట, ఏప్రిల్ 2: బావిలో పూడిక తీసే పనులు చూసేందుకు తాడు సాయంతో లోపలికి దిగుతుండగా ప్రమాదవశాత్తూ జారి పడి రైతు మృతిచెందాడు. ఈ ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాఫానగర్‌లో చోటుచేసుకున్నది. ముస్తాఫానగర్‌కు చెందిన రైతు శివంది దేవయ్య(55) మండల కేంద్రంలోని పశువైద్యశాలలో సబార్డినేట్‌గా పనిచేస్తున్నాడు. అతడికి ఉన్న బావిలో క్రేన్ సాయంతో కూలీలను పెట్టి పూడిక తీయిస్తున్నాడు. పూడికను పరిశీలించేందుకు బుధవారం తాడు సాయంతో బావిలో దిగడానికి ప్రయత్నించగా, ప్రమాదవశాత్తూ జారి పడి మృతి చెందాడు.



## • కడెం నీటిని అందించాలని ధర్నా

నిర్మల్ జిల్లా కడెం ప్రాజెక్టు ఆయకట్టుకు నీరందక పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. దస్తురాబాద్ మండలం దేవునిగూడేనికి చెందిన దాదాపు 60 మంది రైతులు బుధవారం కడెంలోని నీటిపారుదల శాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కడెం ప్రధాన కాల్వ ద్వారా పంటలకు నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. – కడెం



ఫార్మాసిటీ భూముల రైతులతో మాట్లాడుతున్న ఏసీపీ, టీజీఐఐసీ, రెవెన్యూ అధికారులు

# ఫార్మాసిటీ భూముల్లో పంటలు వేయొద్దు

- రైతులకు అధికారుల స్పష్టీకరణ
- నేటి నుంచి ఆ భూముల చుట్టూ ఫెన్సింగ్

రంగారెడ్డి, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ): ఫార్మాసిటీ ఏర్పాటు కోసం సేకరించిన భూముల్లో ఇకనుంచి ఎలాంటి పంటలను సాగుచేయొద్దని అధికారులు ఆయా గ్రామాల రైతులకు స్పష్టం చేశారు. ఫార్మాసిటీ కోసం యాచారం మండలంలోని మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లో సేకరించిన భూములను టీజీఐఐసీ, రెవెన్యూ, పోలీసు అధికారులు బుధవారం పరిశీలించారు. ఆ భూముల్లో కొందరు రైతులు పంటలను సాగు చేసుకుంటున్నట్టు ఈ పరిశీలనలో తేలడంతో ఇకనుంచి ఎలాంటి పంటలు వేయొద్దని అధికారులు ఆదేశించారు. ఫార్మాసిటీ ఏర్పాటు కోసం గత ప్రభుత్వం రంగారెడ్డి జిల్లాలోని కందుకూరు, యాచారం, కడ్తాల్ మండలాల్లో దాదాపు 14 వేల ఎకరాల భూమిని సేకరించడంతోపాటు ఆయా భూముల రైతులకు పరిహారాన్ని కూడా అందజేసింది. అనంతరం రాష్ట్రంలో ప్రభుత్వం మారటం, ఆ భూముల చుట్టూ కంచె వేయకపోవడంతో అక్కడి రైతులు మళ్లీ పంటలు సాగు చేస్తున్నారు. దీంతో గురువారం నుంచి ఫార్మాసిటీ భూములను మళ్లీ సర్వేచేసి, ఫెన్సింగ్ వేయాలని అధికారులు నిర్ణయించారు.

### వివాదాల్లో ఉన్న భూముల్లోకి వెళ్లొద్దు

ఫార్మాసిటీ ఏర్పాటు కోసం సేకరించిన భూముల్లో కొన్నింటిపై వివాదాలున్నాయి. తమ భూములను తీసుకోవద్దంటూ ఇప్పటికే దాదాపు 2 వేల ఎకరాలకు సంబంధించిన రైతులు కోర్టును ఆశ్రయించారు. దీంతో బలవంతంగా భూసేకరణ జరుపరాదని కోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఆ 2 వేల ఎకరాల జోలికి వెళ్లరాదని అధికారులు, పోలీసులు నిర్ణయించుకున్నారు.

## • కాంగ్రెస్‌కు ఓటు వేసి తప్పు చేసినం



కాంగ్రెస్ సర్కార్ వచ్చినంక సాగు నీళ్ల కోసం అవస్థ పడుతున్నామని, కండ్ల ముందే పంటలు ఎండిపోతున్నామని మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం బోడ్కతండా రైతు భూక్య నరేశ్ ఆవేదన వ్యక్తంచేశాడు. రూ.2 లక్షల రుణమాఫీ అవుతుందని, ఎకరానికి రూ.15 వేలు రైతు భరోసా ఇస్తారనే ఆశతో కాంగ్రెస్‌కు ఓటు వేసి తప్పు చేశామని, అప్పుడు ఓటు వేసి ఇప్పుడు అనుభవిస్తున్నామని చెప్పాడు. వానకాలం వర్షాలకు పంటలు దెబ్బతింటే పంట నష్టం రాలేదని, బ్యాంకు లోను రూ.1.20 లక్షలు ఉంటే మాఫీ కాలేదని పేర్కొన్నాడు. కాల్వ నీళ్లు వస్తాయని ఆశతో యాసంగిలో రెండు ఎకరాలు వరిసాగు చేసినంక బావి ఎండిపోయిందని ఆవేదన చెందాడు. రూ.50 వేలు పెట్టుబడి పెడితే పంట ఎడ్లకు మేతగా మారిందని అన్నాడు. కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు నడి వేసవిలోనూ కాల్వ నిండా నీళ్లు వచ్చాయని, కాంగ్రెస్ వచ్చినంక నీళ్ల కోసం గోస పడుతున్నామని చెప్పాడు. – నర్సింహులపేట

## • సాగునీటికీ పెట్టుబడి పెడుతున్న..



పంట సాగు చేస్తే ఎరువులు, విత్తనాలు, కూలీల కోసం పెట్టుబడి పెట్టాల్సి వచ్చేదని, ఇప్పుడు పంటను కాపాడుకునేందుకు నీటి కోసం కూడా పెట్టుబడి పెట్టాల్సి వస్తుందని జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ మండలం జీబీ తండా రైతు బానోత్ రాను ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. తాను ఆరు ఎకరాల పొలం సాగు చేయగా.. ఈ సారి దేవాదుల కాల్వల ద్వారా చెరువులు, కుంటలు నింపకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటి బావులు, బోర్లలో నీరు లేకుండా పోయిందని పేర్కొన్నాడు. ఇప్పటివరకు రూ.3.50 లక్షలు పెట్టుబడి పెట్టినట్టు తెలిపాడు. కనీసం పెట్టుబడైనా వస్తుందా అని ఆవేదన చెందుతన్నాడు. ఇంతటి కరువు ఎన్నడూ చూడలేదన్నాడు. – స్టేషన్ ఘన్‌పూర్

# ఎండుతున్న పంటలు.. మండుతున్న గుండెలు

- అడుగంటిన జలాలు.. వట్టిపోయిన బోర్లు
- పెట్టుబడీ వచ్చే పరిస్థితి లేదని రైతుల ఆందోళన

లోకేశ్వరం, ఏప్రిల్ 2 : భూగర్భ జలాలు పడిపోవడంతో బోర్లలో నీళ్లు రాక పంటలు ఎండిపోతున్నాయి. నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలంలో 15,600 ఎకరాల్లో వరి సాగైంది. మొత్తం బోరుబావుల కిందనే సాగు చేశారు. భూగర్భ జలాలు అడుగంటడంతో సాగు నీరు అందడం లేదు. ఒక్కో రైతు రెండు, మూడు బోర్లను 300 ఫీట్లు వేసినా నీరు పంటలకు సరిపోవడం లేదు. ఫలితంగా పంటలు ఎండి దిగుబడి వచ్చే అవకాశం లేదు. రాయపూర్ కాండ్లి గ్రామానికి చెందిన యువరైతు షేక్ నజీముద్దీన్ గత జనవరిలో బోరు వేయించగా నీళ్లు బాగా పడ్డాయి. ఇప్పటికే రెండు బోరు బావులు ఉండగా.. మరో బోరుబావిని 300 ఫీట్ల వరకు వేయించాడు. బోరు వేసినప్పుడు నీళ్లు బాగా పడటంతో తనకున్న మూడున్నర ఎకరాలకు తోడు మరో మూడెకరాలు కౌలుకు తీసుకున్నాడు. ఇప్పటికే దాదాపు రూ.3 లక్షలకుపైగా ఖర్చు చేశాడు. ప్రస్తుతం వరి పొట్ట దశకు రావడంతో నీరు చాలా అవసరం ఉంటుంది. ఉన్న మూడు బోర్లు వట్టిపోవడంతో వరికి నీరందించలేని దుస్థితి నెలకొన్నది. పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని రైతు ఆవేదన చెందుతున్నాడు.



నిర్మల్ జిల్లా రాయపూర్ కాండ్లిలో ఎండిన పంటను చూపుతున్న రైతు నజీముద్దీన్

### గ్యాంగ్ రేప్ నిందితుల అరెస్టు

వివరాలు వెల్లడించిన ఎస్పీ

కల్వకుర్తి, ఏప్రిల్ 2 : రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపిన గ్యాంగ్‌రేప్ కేసును పోలీసులు రెండ్రోజుల్లోనే ఛేదించారు. లైంగికదాడికి పాల్పడిన నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ, ఊర్కొండపేట గ్రామాలకు చెందిన నిందితులు మరుపాకుల ఆంజనేయులు, ఎండీ సాధిక్ బాబా, వగుల్‌దాస్ మణి(అలియాస్ మణికంఠ), కార్తీక్, మట్ట మహేశ్‌గౌడ్, హరీశ్‌గౌడ్, మట్ట ఆంజనేయులును బుధవారం కల్వకుర్తి డీఎస్పీ కార్యాలయంలో మీడియా ముందు ఉంచారు. మార్చి 29న దేవాలయానికి వచ్చిన ఓ మహిళపై వీరు అఘాయిత్యానికి పాల్పడినట్టు తెలిపారు. డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిందితుల కోసం ప్రత్యేక టీంలు ఏర్పాటు చేసి పట్టుకున్నట్టు ఆయన తెలిపారు.

# రూ.100 కోట్ల బిల్లులు పెండింగ్

- 2,200 పనులు చేసిన కాంట్రాక్టర్లు
- అసలే పట్టించుకోని ప్రభుత్వం
- ఆలిండియా బిల్డర్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ డీవీఎన్ రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ): చిన్న కాంట్రాక్టర్లకు రూ.100 కోట్లు చెల్లిస్తే సుమారు 2,200 బిల్లులు పేమెంట్ అవుతాయని, ప్రభుత్వ పెద్దలకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆలిండియా బిల్డర్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ డీవీఎన్ రెడ్డి ఆవేదన వ్యక్తంచేశారు. రోడ్లు, భవనాల శాఖ, పంచాయతీరాజ్‌శాఖ నుంచే తమ బిల్లులు పెద్ద మొత్తంలో పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. స్పెషల్ డెవలప్‌మెంట్ నిధులు (ఎస్డీఎఫ్) కూడా విడుదల చేయడం లేదని విమర్శించారు. ఇప్పటికే పెద్ద మొత్తంలో పెండింగ్ బిల్లులు పేరుకుపోయాయని, వచ్చే ఆర్థిక సంవత్సరంలో చేపట్టే రూ.3 వేల కోట్ల విలువైన పనులకు నిధులు ఎలా చెల్లిస్తారని ప్రభుత్వాన్ని నిలదీశారు. మంత్రులను, సీఎస్‌ను తమకు రావాల్సిన పెండింగ్ బిల్లులపై ఇప్పటికే అనేకసార్లు వినతిపత్రాలు ఇచ్చామని తెలిపారు.

### ప్రాణాలే పోయే రోజులే వస్తున్నయి

'చేసిన పనులకు కొన్ని నెలలుగా ప్రభుత్వం బిల్లులు ఇవ్వడం లేదు.. ఇప్పటికే మనలో చాలా మంది అప్పులపాలై అవస్థలు పడుతున్నారు.. అసలు ప్రాణాలే పోయే రోజులు దాపురించాయి. ఇక నుంచి కొత్త పనులు చేద్దామా? వద్దా? ఆలోచించి చెప్పండి' అంటూ తెలంగాణ బిల్డర్స్ అసోసియేషన్ మాజీ ప్రెసిడెంట్, ఆలిండియా బిల్డర్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ డీవీఎన్ రెడ్డి రాష్ట్రంలోని కాంట్రాక్టర్లకు సూచించారు. 'అందరూ ప్రశాంతంగా ఆలోచించి మన ప్రయాణం ఎలా చేయాలో సూచనలు చేయండి' అని కోరారు. ఈ మేరకు తోటి కాంట్రాక్టర్లకు డీవీఎన్ రెడ్డి చేసిన ఓ పోస్టు సోషల్‌మీడియా సర్కిళ్లలో వైరల్‌గా మారింది. డీవీఎన్ రెడ్డి సోషల్ మీడియా వేదికగా చేసిన పోస్టు ఇలా ఉన్నది. 'విశ్వావసు నామ సంవత్సరం మొదట మన కాంట్రాక్టర్లనే నిరాశపర్చింది. ఇంత చేదు మార్చి 31 మనం మునుపు చూడలేదు. పేమెంట్లు వస్తాయని ఎదురుచూసినా నిరాశే మిగిలింది. ఇకనైనా మనం మేల్కొని పనులు చేయాలా? వద్దా? అనే నిర్ణయానికి వచ్చి.. మన దగ్గర సొంత డబ్బు ఉంటే తప్ప పని చేయొద్దు. మన సొంత డబ్బు వెచ్చించి చేసిన ఆ పని పేమెంట్ అయితేనే తదుపరి పనిచేసేందుకు పూనుకుంటేనే బాగుంటదని నా విన్నపం. టర్నోవర్లు కాదు మనుషులే పోయే రోజులు వస్తున్నాయి. దయచేసి అందరూ ఆలోచించండి. మన ప్రయాణం ఎలా చేయాలో సూచించండి. మనం మన విలాసాల కోసం అప్పులు చేస్తలేం. ప్రజలకు సౌకర్యం కల్పించడం కోసం ప్రభుత్వానికి పెట్టుబడి పెడుతున్నాం. ఈ ప్రయాణంలో మనం అప్పలపాలవుతున్నాం. మనం ఆలోచించి ప్రయాణం చేయకపోతే మనల్ని ఎవరూ రక్షించరు. మనం మన సంఘం తరపున ఎన్నో విన్నపాలు చేసినం. ఇది నా వ్యక్తిగత ఆవేదన. ఒక్కసారి ఆలోచించండి' అని ఆ పోస్టులో డీవీఎన్ రెడ్డి పేర్కొన్నారు.

### మంత్రివర్గ విస్తరణ వాయిదా!

హైదరాబాద్, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ వాయిదా పడింది. ఈ నెల 3న మంత్రివర్గ విస్తరణ జరుగుతుందని, నలుగురు కొత్త మంత్రులు ప్రమాణ స్వీకారం చేస్తారని ప్రచారం జరిగిన విషయం తెలిసిందే. కానీ, మంత్రివర్గంలో స్థానం కోసం సామాజిక వర్గాలు, జిల్లాల వారీగా పోటీ పెరగడంపై రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నేత కే జానారెడ్డి పార్టీ అధిష్ఠానానికి లేఖ రాయడంతో మంత్రివర్గ విస్తరణ మరో 5-6 రోజులు వాయిదా పడినట్టు సమాచారం. ప్రస్తుతం పార్లమెంట్‌లో కీలకమైన బిల్లులు చర్చ జరుగుతున్నందున రాష్ట్ర మంత్రివర్గ విస్తరణకు కాంగ్రెస్ అధిష్ఠానం ఈ నెల 4 వరకు అనుమతిచ్చే అవకాశాలు లేవని ఆ పార్టీ వర్గాలు స్పష్టం చేశాయి.

# నిరుద్యోగుల మీటింగ్ భగ్నం

- అడుగడుగునా పోలీసుల నిర్బంధం
- జేఏసీ నాయకుడు జనార్దన్ అరెస్టు

చిక్కడపల్లి, ఏప్రిల్ 2: అడుగడుగునా పోలీసుల నిర్బంధం కొనసాగుతున్నది. నిరుద్యోగుల విలేకరుల సమావేశాన్ని భగ్నం చేశారు. మీటింగ్ పరిసర ప్రాంతాల్లో పోలీసులను భారీగా మోహరించి, అభ్యర్థులు ఎవరు రాకుండా అడ్డుకున్నారు. సమావేశానికి మద్దతుగా నిలిచినవారిని అరెస్టు చేశారు. పోలీసుల నిర్బంధంపై నిరుద్యోగులు మండిపడుతున్నారు. కనీసం విలేకరుల సమావేశం కూడా ఏర్పాటు చేసుకోనివ్వరా.. అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. టీజీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ ఫలితాలపై నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం చిక్కడపల్లిలోని త్యాగరాయ గానసభలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు త్యాగరాయ గానసభ వద్ద భారీగా మోహరించారు. ఆ పరిసర ప్రాంతాలకు అభ్యర్థులు ఎవరు రాకుండా అడ్డుకున్నారు. నిరుద్యోగులకు మద్దతుగా వచ్చిన ఫ్యాకల్టీ అశోక్‌ను అరెస్టు చేసి ముషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. చిక్కడపల్లిలో మీడియాతో మాట్లాడుతున్న నిరుద్యోగ జేఏసీ నాయకుడు జనార్దన్‌ను కూడా అరెస్టు చేసి నాంపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టుకు ముందు జనార్దన్ మీడియాతో మాట్లాడుతూ.. గ్రూప్-1 నిర్వహణలో భారీగా అవకతవకలు జరిగాయని ఆరోపించారు. ఒకే సెంటర్‌లో పరీక్ష రాసిన అభ్యర్థులకు 550కుపైగా మార్కులు ఎలా వస్తాయని ప్రశ్నించారు. తెలుగు మీడియం అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తంచేశారు. వెంటనే రివాల్యుయేషన్ చేపట్టాలని డిమాండ్ చేశారు.



నిరుద్యోగుల విలేకరుల సమావేశాన్ని అడ్డుకుంటున్న పోలీసులు